క్లుప్తంగా

చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని ధర్మ శాస్తా ఆలయ ఆవరణలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు ఆదివారం జరిగాయి. పోటీల్లో గెలిపొందిన చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్.నందికేశ్వర రావు, బీఎంఎస్ పట్నాయిక్, ప్రసాద్, ఎల్‌దీప్తి తదితరులు పాల్గొన్నారు.

హర్షవల్లి లయన్స్ క్లబ్‌కు అవార్డులు



అవార్డులు అందుకున్న క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉత్తమసేవలు అందిస్తున్న హర్షవల్లి లయన్స్ క్లబ్ మూడు ప్రత్యేక అవార్డులను అందుకుంది. విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో 316వ లయన్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ పదవీ ప్రమాణస్వీకారం ఉత్సవం సందర్భంగా అవార్డులను అందుకున్నారు. అలాగే ఈ క్లబ్ నుంచి నలుగురు సభ్యులకు పదవులను లయన్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్‌లో పదవులను కేటాయించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నమయ్య సంకీర్తనలు



అన్నమయ్య సంకీర్తనా గానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పీఎన్‌కాలనీలో వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో స్వరాత్మక సంగీత విద్యాపీఠం నిర్వాహకులు కేవీ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనా లహరి ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పి.జగన్మోహనరావు, పి.వి.ఆర్.ఎం. పట్నాయిక్, డాక్టర్ నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో దళితులకు పెద్దపీట



ఎస్సీ సెల్ విభాగం నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు పెద్దపీట వేశారని ఆ పార్టీ ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని పెద్దరెల్లివీధిలో వైఎస్సార్‌సీపీ దళిత విభాగం నాయకులను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ చంద్రబాబుకు దళితులంటే చిన్నచూపు అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. దళితులంతా ఏకతాటిపైకి వచ్చి కూటమి నేతల ఆగడాలకు చెక్ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో దళిత నాయకులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: రక్తదానం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని జే.ఆర్.పురం పంచాయతీ సీతంవలసలో ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు ముద్దాడ రాజశేఖర్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. 18 మంది రక్తదానం చేసిన రక్తాన్ని శ్రీకాకుళం రెడ్‌క్రాస్ రక్తనిధికి అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, నాయకులు పిన్నింటి సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెరవే కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 107వ నెల సాహితీ సమ్మేళనం స్థానిక శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం జరిగింది. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి నిర్వహణలో 14 మంది కవులు పాల్గొని స్నేహితుల దినోత్సవంపై కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో కవులు భోగిల ఉమామహేశ్వరరావు, బిఎస్‌డీ ప్రసాద్, ఎం.శ్రీనివాస్‌రావు, ఇద్ది పాపయ్య, ఎం.ఉపేంద్రశర్మ, వి.రాజారావు, బి.జగన్నాథరావు, ఎస్.ఉమామహేశ్వరరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బౌ..బోయ్..!



రోడ్లపై గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

- మురపాకలో కుక్కల బెడద
- ఇటీవల ర్యాబిస్‌తో యువకుడు మృతి
- పట్టించుకోని అధికారులు

ఎచ్చెర్ల: కుక్కకాటుతో ఒక యువకుడు మృతి చెందాడని చెప్పినా.. వీధి కుక్కలతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు గగ్గోలు పెడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు నమస్తే ఎచ్చెర్ల కార్యక్రమంలో భాగంగా ఇక్కడ కుక్కలను తొలగించాలని నేరుగా అధికారులకు చెప్పినా ఇంతవరకూ అధికారులు ఆ ఊసే ఎత్తడం లేదు. ఇదీ లావేరు మండలంలోని మురపాక పరిస్థితి. ఇక్కడ వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో నిత్యం గుంపులుగా దర్శనమిస్తూనే ఉన్నాయి. రోడ్లపైన విచ్చలవిడిగా తిరుగుతూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొన్ని గజ్జికుక్కలు ఏకంగా ఇళ్లల్లోనే ఉంటున్నాయి. ఎండలకు తట్టుకోలేని ఈ కుక్కలు మరుగుదొడ్లలో, వంటగదుల్లో బస చేస్తున్నాయి. దుర్వాసనతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇక్కడ చాలా మంది కుక్క కాట్లకు గురవుతున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను నిర్మూలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వీధుల్లో సంచరిస్తున్న గజ్జి కుక్కలు

ఇబ్బందులు పడుతున్నాం



గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. దీంతో చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది. చిన్న పిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. దీంతో ఏ క్షణంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది.

– గేదెల సురేష్‌కుమార్, మురపాక

రోడ్లపైనే సంచారం



వీధి కుక్కలు గుంపులుగా రోడ్లపైనే సంచరిస్తున్నాయి. దీంతో వాహనాలు నడిపేటప్పుడు వీటివలన ప్రమాదాలు జరుగుతున్నాయి. బండి వెనుక పడుతుండడంతో భయాందోళన చెందుతున్నాం. అధికారులు స్పందించి వీటిని నిర్మూలించాలి.

– గొర్లె దుర్గారావు, మురపాక

చర్యలు తీసుకుంటాం

మురపాకలో కుక్కల బెడద మా దృష్టికి వచ్చింది. దీనిపై పంచాయతీ అధికారులతో చెప్పడం జరిగింది. మరోసారి దీనికోసం మాట్లాడి చర్యలు తీసుకుంటాం. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయానికి లెటర్ పెట్టనున్నాము. సంబంధిత సంస్థలతో మాట్లాడి కుక్కలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటాం.

– పి.వెంకటరాజు, ఎంపీడీవో, ఎచ్చెర్ల

ఆదిత్యుని సన్నిధిలో శ్రావణ పూజలు



సూర్య నమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి సన్నిధిలో శ్రావణమాస పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్టు దర్శనమివ్వడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేశారు. ఎండతీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. అలాగే అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు. దాతలు, ప్రముఖులకు అంతరాలయ దర్శనం చేయించారు. కేశఖండన శాలలో కొందరు భక్తులు తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకోగా.. మరికొందరు భక్తులు ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. అలాగే ఆదివారం సందర్భంగా పలువురు భక్తులు అన్నప్రసాదాల కోసం విరాళాలను ఇవ్వగా.. సుమారు 400 మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. ఏలూరు మేయర్ నూర్జహాన్ దంపతులు కుటుంబ సమేతంగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. వీరికి అంతరాలయ దర్శనం చేయించి ప్రత్యేక తీర్థప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు.



దర్శనానంతరం దివ్యాంగురాలిని ఎత్తుకుని తీసుకొస్తున్న దృశ్యం



ఏలూరు మేయర్ నూర్జహాన్ దంపతులకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈవో ప్రసాద్, శంకరశర్మలు

ప్లాస్టిక్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్లాస్టిక్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. అరసవల్లి జంక్షన్ నుంచి స్వామి వివేకనంద (సూర్యమహల్) సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ప్లాస్టిక్ వినియోగించడం వలన జరిగే అనర్థాలను విద్యార్థినులు తమ ప్రదర్శనల ద్వారా వివరించి ఆకట్టుకున్నారు. మానవ మనుగడకు పెనుభూతం ప్లాస్టిక్ వినియోగమేనని, వీటివల్లే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, ఎన్ఎస్ఎస్ పీవో హరిమానస, రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్య, రమణ పాల్గొన్నారు.

ఖరీఫ్ సందడి..!

ఇటీవల కురుస్తున్న వర్షాలకు జి.సిగడాం మండలంలో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. మండలవ్యాప్తంగా జోరుగా వరి నాట్లు వేస్తున్నారు. రైతులంతా వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంట పొలాల్లో పనులు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలిస్తే అధిక దిగుబడులు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– జి.సిగడాం



నాగువలసలో వ్యవసాయ పనులకు వెళ్తున్న మహిళలు



నిద్దాంలో ఆకు సర్దుబాటు చేస్తున్న దృశ్యం



దవళపేట - సంతవురిటి గ్రామాల మధ్య వ్యవసాయ పనుల్లో మహిళలు



జాడలో దమ్ము చేస్తున్న దృశ్యం



పెంట గ్రామంలో వరి ఆకు తీసుకెళ్తున్న రైతన్న

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ



మహిళలకు చంద్రబాబు మోసాలు వివరిస్తున్న కిరణ్ కుమార్ తదితరులు

రణస్థలం: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండములగాం, జే.ఆర్.పురం పంచాయతీల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంగా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. హామీలపై నిలదీస్తున్న ప్రతిపక్ష నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రయోగిస్తున్నారని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాలు అందక ఎంతోమంది పేదలు ఎన్నో బాధలుపడుతూ వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పాలనలో చోటుచేసుకున్న అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలు గురాన తిరుమల మానస, నాయకులు గొర్లె అప్పలనాయుడు, కలిశెట్టి కన్నం నాయుడు, మజ్జి రమేష్, గొర్లె అప్పలనర్సునాయుడు, రెడ్డి వాసు, బవిరి రమణ, పచ్చిగుళ్ల సాయిరాం, ఇడదాసుల తిరుపతిరావు, దన్నాన సీతారాం, టేకి బ్రహ్మాజీ, మింద్రాన రామారావు, పిల్లా ఆనంద పాత్రుడు, దన్నాన హరి, ఉల్లాకుల శ్రీనివాస్ యాదవ్, పవన్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అభినందనలు



కార్మికులను అభినందిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎచ్చెర్ల: సీఐటీయూ యూనియన్‌లో శ్యాంపిస్టన్స్ ప్లాంట్-3 కార్మికులు 60 మంది చేరడాన్ని సీఐటీయూ పూర్వపు రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.గోవిందరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరావు, శ్యాంపిస్టన్స్ ప్లాంట్-3 యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అభినందించారు. ఆదివారం లావేరు మండలంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సీఐటీయూ కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. శ్యాంపిస్టన్స్ ప్లాంట్-3 యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్వీ రమణ, ప్రధాన కార్యదర్శి వై.ఆదినారాయణలు మాట్లాడుతూ పరిశ్రమలో సీఐటీయూ యూనియన్ ఏర్పాటు చేసి, సుదీర్ఘ కాలం సమ్మె నడిపి కార్మికులందరికీ వేతన ఒప్పందాలు చేసిన ఘనత తమకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పి.శ్రీనిబాబు, పి.దుర్గాప్రసాద్, ఎం.శ్రీను, పి.మహేష్, కె.అప్పలనాయుడు, ఎల్.చక్రధర్, జె.వెంకటసూరి, పి.లక్ష్మంనాయుడు, ఎం.నాగభూషణరావు, నారాయణరావు, భాస్కరరావు, గోవిందరావు, కె.నాగార్జున, డి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులాలను సందర్శించాలి



హోం మంత్రి అనితకు వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలను సందర్శించాలని, బాలికల పాఠశాలల్లోని పురుష ఉద్యోగులను వేరేచోటకి బదిలీ చేయాలని, తరగతి గదుల్లో ఉపాధ్యాయులకు సెల్‌ఫోన్ అనుమతించకూడదని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు దళిత సంఘాల జేఏసీ నాయకులు కోరారు. నగరంలోని అరసవల్లిలో ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో నాసిరకంగా ఇంగ్లిష్ మీడియం బోధిస్తున్నారన్నారు. నాణ్యత లేని కూరగాయలు, చికెన్ సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్స్‌పై తగు విచారణ జరిపి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వారంలో నాలుగు రోజులు ఒకే రకమైన కూరలు వండడం వలన విద్యార్థులు తినడం లేదని వాపోయారు. మంత్రిని కలిసినవారిలో దళిత సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు లోపింటి తేజేశ్వరరావు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి శ్రీకాకుళం నగర అధ్యక్షుడు కానుకూర్తి గోవింద, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్ కుమార్, లోపింటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



శ్రీకాకుళం: వేడుకల్లో మున్సిపల్ హైస్కూల్ పూర్వపు విద్యార్థులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి రత్నాల వరప్రసాద్ మాట్లాడుతూ.. సృష్టిలో అతి మధురమైనది స్నేహమన్నారు. ఆపదలో ఆదుకుంటూ.. కష్టాల్లో తోడుంటూ అనునిత్యం మన ఎదుగుదలలో స్నేహితులు మాత్రమే ఉంటారన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ కో–ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, గుడ్ల సత్యనారాయణ, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.లక్ష్మి, సుగంధం సంజీవరావు, డాక్టర్ జీఎస్ రావు, అంకాడాల తవిటన్న, గుడ్ల గోపాలరావు, మెట్ట ధనుంజయ బట్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: నగరంలోని మున్సిపల్ హైస్కూల్లో 1976లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆనందోత్సాహాలతో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. అందుబాటులో ఉన్న 30 మంది విద్యార్థులు 80 అడుగుల రోడ్డులోని ఒక ప్రైవేటు అతిథి గృహంలో కలుసుకొని అలనాటి అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందంగా గడిపారు. ఎంబీ కామేశ్వరరావు, గోపాత్రావుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పి.శారద, చల్లా రమణమూర్తి, రామలింగం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రసాదరావును సన్మానిస్తున్న స్టార్ వాకర్స్ క్లబ్ నాయకులు

సామాజిక సేవలో యువత

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి శత జయంతి వేడుకల్లో భాగంగా సత్యసాయి న్యూకాలనీ మందిరం ఆధ్వర్యంలో సాయి యువత ఆర్తజన సేవను ఆదివారం నిర్వహించారు. అభాగ్యులైన ఆరుమందికి క్షవరం చేయించి, స్నానం చేయించి, నూతన వస్త్రాలు ధరింపచేసి అల్పాహారం అందజేశారు.